# 'జాలి మాత్రమే చాలదు'

మన కళ్లెదుట కష్టాల్లోపడి కడగండ్ల పాలైన వ్యక్తుల్నీ కుటుంబాల్నీ మనం రోజూ చూస్తూనే ఉంటాం.

'ప్చ్!' 'పాపం!' 'అయ్యో!' 'ఏమిటో!' లాంటి సానుభూతి పదాల్ని ధారాళంగా వాడుతూ వాళ్ల చుట్టూ తిరుగుతూనే ఉంటాం.

వాళ్లకి చేయగలిగింది ఏమైనా ఉందా అని మాత్రం ఆలోచించం. చేయగలిగింది ఏమైనా ఉన్నా... చేయడానికి మనం మాత్రమేనా ఉంది? పక్కింటి పుల్లయ్యో ఎదురింటి ఎల్లయ్యో లేరా? వాళ్లకి పట్టంది మనకు మాత్రమెందుకు? అనాలోచిస్తూ కేవలం అయ్యో! పాపం! లాంటి పదాల్తో ఎదుటివాళ్ల కష్టాలకు సానుభూతి ప్రకటిస్తూ బతికేస్తాం. (ఇదే మనం కష్టాల్లో వున్నప్పుడు ఇరుగుపొరుగు ఎల్లయ్యలూ పుల్లయ్యలూ ఇట్లాగే ఆలోచిస్తారని మరచిపోతాం.)

కానీ మనమధ్యనే ఒక వ్యక్తి ప్రత్యక్షమవుతాడు. అతను అయ్యో! పాపం! లాంటి పదాల్తో మాత్రమే సరిపుచ్చకుండా నిజంగా కష్టాల్లో ఉన్న వ్యక్తులకు తనకు చేతనైన సహాయం చేస్తూ కనబడతాడు.

ఈమధ్య దినపత్రికల్లో మనం తరచూ చూసే వార్త ఒకటి ప్రచురితమైంది. 'తాగుడుకు డబ్బివ్వలేదని కట్టుకున్నదాన్ని కడతేర్చిన కసాయి' అన్నది ఆ వార్త. అందరూ ఆసక్తితో అట్లాంటి వార్తలు చదువుతారు. చదివి అనుకూలంగా మరచిపోతారు. నేనూ అట్లాగే ఆ వార్త చదివాను. ఆ సంఘటన మా పొరుగువాడలోనే జరిగింది కావడం మూలాన మరింత ఆసక్తితో చదివాను.

హత్య కాబడిన అమ్మాయి నిర్మల...చిట్టిగా పిలవబడేది. భర్త పరమ వ్యసనపరుడు. వాళ్లకిద్దరు పసికందులు. ఓ బాబూ ఓ పాప. రోజూలాగే భర్త తాగి ఇంటికొచ్చాడు. ఇంట్లో గొడవ. ఆ అమ్మాయి అక్కడ యిక్కడా పాచిపనులు చేసి ఇల్లు గడుపుకునేది. తాగింది చాలక ఇంకా డబ్బులిమ్మని ఆ అమ్మాయిని మొగుడు చితకతన్నాడు. పిల్లల తిండికే లేదు నీ తాగుడుకు ఇవ్వనుగాక ఇవ్వను అని మొండికేసిందా అమ్మాయి. వాడుకత్తి తీసుకుని ఇద్దరు పసికందుల సాక్షిగా ఆ అమ్మాయిని దారుణంగా పొడిచి పొడిచి చంపేసాడు. అదీ

వార్త. ఆసక్తిగా చదివి "అయ్యో పాపం పసిపిల్లలు ఏం కావాలో, వాడెంత దుర్మార్గపు ముండాకొడుకో!" అని అనుకుని మామూలుగానే మరిచిపోయాను.

అయితే వారంరోజుల్తర్వాత ఓ చిన్న బాక్సు కట్టిన వార్తలాంటి విన్నపం పేపర్లో మళ్లీ చూసాను. పైన ఉదహరించిన వార్తలో హత్యకాబడిన నిర్మల పిల్లలను ఆ అమ్మాయి ముసలితల్లి దగ్గరకు చేర్చారనీ, ఆ ముసలితల్లి పసిబిడ్డల్ని సాకి సంతరించే స్థితిలో లేదనీ చేతనైనవాళ్లు చేతనైన మేర సహాయం చేయాలనీ ఆ విన్నపం.

ఆ విన్నపాన్ని ప్రచురింపచేసిన వ్యక్తి సంఘ సేవకునిగా కానీ, రాజకీయ నాయకుడిగా కానీ గుర్తింపు వున్న వాడు కాదు.

అతను ఒకానొక సామాన్య పౌరుడు. చిన్న మెడికల్ సేల్స్ రిప్రెజెంటేటివ్. రోజూ మందుల శాంపిల్స్ పట్టుకుని ప్రతి డాక్టర్నీ వాళ్లు చీదరించుకున్నా, విసుక్కున్నా కలుస్తూ మందులు అమ్మే అతిసాధారణ వ్యక్తి.

పైగా అతను నాకు పరిచితుడు కావడంతో నాలో తెలీని అపరాధ భావన. ఆ వ్యక్తి పేరు వెంకటేశ్వరరెడ్డి. యువకుడు, అభ్యుదయవాది. అయితే అభ్యుదయాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించే వ్యక్తి.

ఆ చంపబడ్డ నిర్మల తాలూకు పసిపిల్లలకోసం, తన స్వంత పనులు మానుకుని రోజూ కలక్టరేట్ చుట్టూ తిరిగాడు. పేపర్లో భార్య పేరున విన్నపం ప్రకటించి వచ్చిన విరాళాల్ని ఆ పసిపిల్లల అమ్మమ్మకు అందజేశాడు.

మూడు నాలుగు నెలలు కలెక్టర్ను వేధించి విసిగించి ఆ పసిపిల్లల పేరున కొద్దిగా భూమిని మంజూరు చేయించాడు.

ఇంతా చేస్తే వెంకటేశ్వరరెడ్డికి గానీ అతని భార్యకుగానీ హత్య చేయబడ్డ నిర్మల, హత్య చేయబడే వరకూ ఎవరో తెలియదు. అనాథలుగా మిగిలిన ఆ పసికందుల్ని చూసి జాలిపడి, 'అయ్యో! పాపం!' అని మాత్రమే అనుకోకుండా, చేయగల్గిన సహాయం చేసారు. తీవ్రమైన అస్తిత్వ వాదిగా 'నేను' 'నాది' అని ప్రవచిస్తూ రాతలు రాసే నేను కూడా ఆలోచించా... ఇతరులకి సాయం చేయడంలో ఉన్న తృప్తి కోసమైనా చేతనైన మేర ఇతరుల అవసరాలకి సాయం చేయలేమో.

కొన్ని శతాబ్దాలుగా వినవస్తూన్న సూక్తి ఇక్కడ చెప్పుకుందాం.

"పరోపకారాయ ఫలన్తి వృక్షాః పరోపకారాయ వహన్తి నద్యాః
పరోపకారాయ చరన్తిగావః పరోపకారార్థం మిద శరీరం..."

మనం నష్టపోకుండానే ఇతరుల కష్టాలకు సాయం చేయవచ్చు. ●